సాక్షి నిజామాబాద్

మంగళవారం ꞉ 8 ꞉ జూలై ꞉ 2025



ఫిర్యాదుల పరిష్కారానికి..

ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు.

- 8లో ▸



మహిళా ప్రాంగణాలకు పూర్వ వైభవం

మహిళా ప్రాంగణాలు పూర్వ వైభవం సంతరించుకుంటున్నాయని మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ శోభారాణి అన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.8 /22.6

ఉదయం ఆహ్లాదకరమైన గాలులువీస్తాయి. ఆకాశంలో మేఘాలు దట్టంగా అలుముకుని అక్కడక్కడ భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

దళారులను నమ్మి మోసపోవద్దు

- డీఎస్‌వో అరవింద్‌రెడ్డి



సుభాష్‌నగర్ : రేషన్ కార్డుల కోసం ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ముఖ్యంగా దళారులను నమ్మి మోసపోవద్దని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి (డీఎస్‌వో) అరవింద్‌రెడ్డి ఒక ప్రకటనలో సూచించారు. ప్రజలు అనేక మంది జిల్లా కలెక్టరేట్‌కు వచ్చి డీఎస్‌వో కార్యాలయంలో వివరాలు ఆరా తీస్తున్నారని పేర్కొన్నారు. రేషన్‌కార్డుల మంజూరు విషయంలో తమ వద్ద ఎప్పటికప్పుడు దరఖాస్తులు క్లియర్ చేస్తున్నామని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి అప్రూవ్ చేసిన దరఖాస్తులను ఆటోమెటిక్‌గా మంజూరు చేస్తున్నామన్నారు. ప్రజలు దళారులను నమ్మి ఎవరికీ డబ్బులు ఇవ్వవద్దని, కొందరు బయటి వ్యక్తులు డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు పేర్కొన్నారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందన్నారు. ప్రజలు మీసేవలో దరఖాస్తులు సమర్పించిన తర్వాత నిబంధనల మేరకు ప్రభుత్వం విచారణ చేసి కార్డులను మంజూరు చేస్తుందని డీఎస్‌వో తెలిపారు.

10న ధ్రువపత్రాల పరిశీలన

నిజామాబాద్‌అర్బన్: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పీజీ సీఆర్‌టీ, సీఆర్‌టీ, యూఆర్‌ఎస్ పోస్టుల భర్తీలో భాగంగా దరఖాస్తుదారుల ధ్రువపత్రాలను ఈనెల 10వ తేదీన పరిశీలించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్జెక్టుల వారీగా మెరిట్ లిస్టును రూపొందించామని, అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన కోసం కలెక్టరేట్‌లోని సమగ్రశిక్ష కార్యాలయంలో హాజరు కావాలని పేర్కొన్నారు. మెరిట్ లిస్టును కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

టీటీసీ పరీక్షల హాల్‌టికెట్లు విడుదల

నిజామాబాద్‌అర్బన్: టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ థియరీ పరీక్షలకు సంబంధించి హాల్ టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని డీఈవో అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 3వ తేదీన పరీక్ష ఉంటుందని, హాల్ టికెట్లలో ఏవైనా తప్పులు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించాలన్నారు.

ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జీగా అజ్మతుల్లా

నిజామాబాద్ సిటీ: పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జీగా అజ్మతుల్లా హుస్సేన్‌ని అధిష్టానం నియమించింది. వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా ఉన్న అజ్మతుల్లా ఉమ్మడి జిల్లాలో గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు పార్టీ బలోపేతంపై దృష్టి సారించనున్నారు. అజ్మతుల్లాను ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీగా నియమిస్తూ ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

9న విద్యుత్ ఉద్యోగుల విధుల బహిష్కరణ



సుభాష్‌నగర్: జాతీయ కో ఆర్డినేటర్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజినీర్ పిలుపు మేరకు జూలై 9న విద్యుత్ ఉద్యోగులు విధులు బహి ష్కరించనున్నట్లు తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ రఘునందన్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రవీందర్‌ను కలిసి నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాని కి వ్యతిరేకంగా ఒకరోజు విధులను బహిష్కరించాలని టీ-జాక్ సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపా రు. అదే రోజు పవర్ హౌజ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. షిఫ్ట్ విధుల్లో పని చేస్తున్న ముఖ్యమైన సిబ్బందికి మినహాయింపు ఉంటుందని తెలిపారు. నిజామాబాద్ ఎంఆర్‌టీ, డిచ్‌పల్లి సెంట్రల్ ఆఫీస్ డివిజన్‌లో విద్యుత్ ఉద్యోగులు, ఇంజినీర్లు నిజామాబాద్ పవర్ హౌజ్ ఎదుట, బోధన్, ఆర్మూర్ డివిజన్ ఉద్యోగులు, ఇంజినీర్లు కార్యాలయాల ఎదుట విధులు బహిష్కరించి ధర్నా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కో చైర్మన్ పి గంగాధర్, కన్వీనర్ బాలేశ్‌కుమార్, కో కన్వీనర్ తోట రాజశేఖర్, జేఏసీ కార్యవరణ కార్యదర్శి ఎం శ్రీనివాస్, 1104 జిల్లా అధ్యక్షుడు రాజేందర్, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ జిల్లా కార్యదర్శి గంగా రాం నాయక్ పాల్గొన్నారు.

ఉల్లంఘనలు.. అనుమతులు

బఫర్ జోన్.. ఎఫ్‌టీఎల్, ప్రభుత్వ భూమి.. పార్కు స్థలం ఏదైనా నిజామాబాద్ నగరంలో నిర్మాణాల జోరు ఆగడం లేదు. అధికారులు అన్ని అనుమతులు, ధ్రువీకరణలు ఇస్తుండడంతో ప్లాట్లు, అపార్ట్‌మెంట్‌లలో ప్లాట్లు కొనుగోలు చేసే వారు తమ అనుమానాలను పక్కన పెట్టేస్తున్నారు. ఇష్టారీతిన చేపడుతున్న నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడానికి టౌన్ ప్లానింగ్ అధికారుల జేబులు నిండడమే కారణమనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.



పార్క్ కోసం కేటాయించిన స్థలం

- నగరపాలకంలో నకిలీ ఎల్‌ఆర్‌ఎస్ మీద జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించగా, అధికారులు విచారణను వదిలేసి నకిలీ ఎల్‌ఆర్‌ఎస్ తయారు చేసిన ప్లానర్ తరఫున ఉండి, బాధితుడిని బెదిరించి సెటిల్‌మెంట్ చేయడం విశేషం. నకిలీ ఎల్‌ఆర్‌ఎస్ తయారు చేసిన ఇంజినీరును కాపాడి ఫిర్యాదు చేసిన ప్లాట్ ఓనర్‌ను బెదిరించి ఫీజు కట్టించారు. ఫిర్యాదును విత్‌డ్రా చేసుకోవాలని బ్లాక్‌మెయిల్ చేశారు. ఇదిలా ఉండగా గాయత్రినగర్‌లో ఓ వ్యక్తి వెంచర్ వేసి ప్లాట్లను అమ్మేశాడు. ఇందులో ఒక ప్లాట్‌లో నిర్మాణానికి సంబంధించి సదరు వెంచర్ వేసిన వ్యక్తి పేరిట బిల్డర్ టీఎస్‌బీపాస్ ద్వారా దరఖాస్తు చేయగా అనుమతులు ఇచ్చారు. విచిత్ర మేమిటంటే అదే దరఖాస్తుపై మరో వ్యక్తి పేరుమీద అనుమతులు ఇచ్చారు. దీనిపై విచారణ చేయకుండా అధికారులు సదరు ఫైల్‌ను తొక్కిపెట్టడం గమనార్హం.

- నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు
- పట్టించుకోని యంత్రాంగం
- బఫర్‌జోన్లు, ఎఫ్‌టీఎల్‌లోనూ అనుమతులు ఇచ్చిన టౌన్‌ప్లానింగ్ అధికారులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన హైడ్రా లాంటి వ్యవస్థను జిల్లాలోనూ ఏర్పాటు చేయాలని డిమాండ్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో నిజామాబాద్ నగరంలో ఆక్రమణలు, నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్మాణాల కారణంగా నగరమంతా జిగ్‌జాగ్‌గా మారి నిత్యం అవస్థలు పడాల్సి వస్తోందని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంతటా అధికారుల పాత్ర!

అధికారులు పూర్తిస్థాయిలో అనుమతులు ఇవ్వడంతో మధ్యతరగతి ప్రజలు ప్లాట్లు, ఫ్లాట్లు కొనుక్కున్నారు. సదరు స్థలాలు, అపార్ట్‌మెంట్లు బఫర్ జోన్‌లో ఉన్నాయా, ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయా, ప్రభుత్వ భూములు, పార్కుల్లో ఉన్నాయా అనే విషయమై అనుమానాలున్నప్పటికీ అధికారులు అన్ని ధ్రువీకరణలు ఇవ్వడంతో కొనుగోలు చేశారు. అయితే నగరంలో బిల్డర్లు నిర్మించిన చాలా అపార్ట్‌మెంట్లలో అత్యవసర సమయాల్లో ఫైరింజన్ తిరిగే పరిస్థితి లేదు. ఇక వినాయక్‌నగర్‌లో ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ కట్టిన అపార్ట్‌మెంట్‌లో లోపాల కారణంగా ఐదో అంతస్తులో రూఫ్ లీక్ అవుతోంది. ఈ విషయమై కొనుక్కున్నవారు అడిగితే పట్టించుకోకపోవడంతో వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇష్టం వచ్చినట్లు నిర్మాణాలు చేసినప్పటికీ అధికారులు అనుమతులు ఇవ్వడం విశేషం. పైగా టౌన్ ప్లానింగ్ అధికారులు జేబులు నింపుకుని ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొట్టడం గమనార్హం.

వినాయక్‌నగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాల సమీపంలో లేఅవుట్‌కు సంబంధించి రోడ్డు విషయమై 2008లో సర్వే అండ్ ల్యాండ్ రెవెన్యూ విభాగంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన వ్యక్తి తనకు అడిగినన్ని ముడుపులు అందకపోవడంతో సమస్యను సృష్టించి వదిలేశాడు. ఇందులో భాగంగా సదరు లేఅవుట్‌లో పార్క్ పక్కన ఉన్న రోడ్డును పార్కులో కలిపేసే కుట్ర చేశాడు. 2009 నుంచి రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పలుసార్లు సర్వే చేశారు. హైకోర్టు చీవాట్లు పెట్టినప్పటికీ మున్సిపల్ అధికారులు మాత్రం ఇప్పటికీ సమస్య పరిష్కారం చేయలేదు. పైగా టౌన్ ప్లానింగ్ అధికారులు సెటిల్‌మెంట్ చేసేందుకు ప్రయత్నాలు చేస్తుండడం గమనార్హం.

ఎన్నికల కోడ్ ఉన్న సమయంలోనే..

బోధన్ రోడ్డులో రూ.కోట్ల విలువైన మున్సిపల్ పార్క్ స్థలాన్ని కొట్టేసేందుకు పకడ్బందీగా ప్లాన్ అమలు చేశారు. ఖోజా కాలనీలోని ప్లాటినం కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ పరిధిలోని 2,666.88 చదరపు గజాల భూమిని మింగేసేందుకు పక్కాగా పావులు కదిపారు. ఈ స్థలాన్ని లేఅవుట్ పార్క్ స్థలంగా కేటాయించారు. అప్పటి నుంచి దీన్ని అలాగే వదిలేశారు. ఈ మైదానం చుట్టూ ప్రహరీ గోడ కట్టేందుకు గాను 13వ ఆర్థిక సంఘం నుంచి వచ్చిన నిధుల్లో రూ.15 లక్షలు కేటాయించారు. ఆర్థిక సంఘం నుంచి మొత్తం 25 చోట్ల వివిధ పనులకు సంబంధించి నిధులు కేటాయించినట్లు కౌన్సిల్ సమావేశంలో ప్రకటించారు. ఇందుకు సంబంధించి మిగిలిన 24 చోట్ల పనులు పూర్తి చేయగా, ఈ ఒక్క చోట మాత్రం ఇప్పటివరకు ప్రహరీ నిర్మాణ పనులు చేయలేదు.

ఇందుకోసం కేటాయించిన రూ.15 లక్షల నిధులు సైతం హాంఫట్ కావడం విశేషం. కాగా 2016 ఆగస్టు 27న అప్పటికే నిర్మాణం పూర్తయిన ప్లాటినం హౌసింగ్ సొసైటీ మసీదు కోసం ఈ స్థలాన్ని కేటాయించేందుకు మున్సిపల్ కౌన్సిల్‌లో భూమి బదిలీ ప్రతిపాదన పెట్టారు. బదులుగా ప్రాధాన్యత లేని చోట స్థలం ఇచ్చేందుకు నిర్ణయించారు. ఈ క్రమంలో కౌన్సిల్ అప్పటి కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖైసర్ ఈ భూమి బదిలీ ప్రతిపాదనను వ్యతిరేకించారు. దీంతో తిరస్కరణకు గురైంది. ఇదిలా ఉండగా మరోసారి 2019 ఫిబ్రవరి 5న భూమి బదిలీ ప్రతిపాదనను పునఃపరిశీలించాలని కౌన్సిల్‌లో పెట్టారు. 2019 ఏప్రిల్‌లో పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో భూమి బదిలీ చేస్తూ తీర్మానం చేశారు. దీంతో సయ్యద్ ఖైసర్ అప్పటి సీడీఎంఏ (కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) సత్యనారాయణకు 2019 జూన్ 10న ఫిర్యాదు చేశారు. దీంతో ఈ భూమి బదిలీ ప్రక్రియకు బ్రేక్ పడింది. అయితే సమస్య మాత్రం సమస్యగానే ఉంది. ఈ విషయాలపై నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్‌ను వివరణ కోరగా ఈ విషయాలపై పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

అధికారుల అండదండలతోనే అక్రమ నిర్మాణాలు



అక్రమ నిర్మాణాలు చేపడితే వెంటనే కూల్చివేయాలి. సెట్‌బ్యాక్ లేకుండా నిర్మించినా, పార్కింగ్ స్థలాలు లేకుండా నిర్మించిన కట్టడాలు తొలగించాలి. అక్రమాలకు టౌన్‌ప్లానింగ్ అధికారులు వత్తాసు పలుకుతున్నారు. అహ్మదీబజార్, బోధన్ రోడ్డు, ఖలీల్‌వాడీ, వినాయక్ నగర్, గంగాస్థాన్ ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు ఎక్కువగా సాగుతున్నాయి. అక్రమాలను ప్రోత్సహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి.

– సయ్యద్ ఖైసర్, మైనారిటీ నాయకుడు

కఠిన చర్యలు తీసుకోవాలి



పాత భవనాలు కూల్చివేసి కొత్త నిర్మాణాలు చేస్తున్నారు నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. ఖలీల్‌వాడీ, వినాయక్‌నగర్ లాంటి రద్దీ ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు అధికంగా సాగుతున్నాయి. బహుళ అంతస్తుల భవనాలు నిర్మించేవారు సెట్ బ్యాక్‌లు వదలడంలేదు. సెల్లార్‌ల్లో పార్కింగ్ కాకుండా వ్యాపారాలు చేస్తున్నారు. నిబంధనలు అతిక్రమించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ట్రాఫిక్ ఫ్రీ ఇందూరుగా మార్చాలి. అధికారులు కొరఢా ఝులిపిస్తేనే నగర రూపురేఖలు మారుతాయి.

– అరికెల సత్యనారాయణ, సుభాష్‌నగర్‌వాసి

10 నుంచి 'మహిళా శక్తి' సంబురాలు

- పండుగ వాతావరణంలో విజయోత్సవాలు నిర్వహించాలి
- జిల్లా సమాఖ్య సమావేశంలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్ : ఇందిరా మహిళా శక్తి సంబురాలను ఈ నెల 10 నుంచి 16వ తేదీ వరకు పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా సమాఖ్య సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

విజయోత్సవ సంబరాల సన్నద్ధత, కార్యాచరణ కోసం మంగళవారం అన్ని మండలాల్లో సమాఖ్య సమావేశాలు, బుధవారం గ్రామ సంఘాలతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. మహిళా స్వయం సహాయక సంఘా ల సభ్యులు విజయోత్సవ సంబరాలలో ఉత్సాహంగా పాల్గొనేలా చూడాలన్నారు. అర్హులకు వడ్డీ లేని రుణాలు, ఇతర ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన చెక్కులు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తూ, రాష్ట్రంలో మహిళా సాధికారత సాధించాలనే కృతనిశ్చయంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని కలెక్టర్ గుర్తు చేశారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా స్వయం సహాయక సంఘాల మహిళలు వ్యాపారాలు, ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తూ అభ్యున్నతి సాధించేలా తోడ్పాటునందించాలన్నారు. అనంతరం కలెక్టరేట్ సమీపంలో నిర్మాణంలో ఉన్న జిల్లా మహిళా సమాఖ్య భవనాన్ని పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డీఆర్డీవో సాయాగౌడ్, జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కమిషనర్‌తో 'సాక్షి' ఫోన్‌ఇన్



నిజామాబాద్ నగర ప్రజలు తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధ్యం తదితర అంశాలపై నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్‌తో నేరుగా మాట్లాడొచ్చు.

తేది : 08-07-2025 (మంగళవారం)

సమయం: ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు..

ఫోన్ చేయాల్సిన నంబర్: **78159 57047 / 99897 09595**

శాంతిభద్రతల కోసం మహిళా సిబ్బందికి శిక్షణ



మాట్లాడుతున్న సీపీ పోతరాజు సాయిచైతన్య

ఖలీల్‌వాడి : శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా మహిళా సిబ్బందికి వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు సీపీ పోతరాజు సాయిచైతన్య అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మహిళాకానిస్టేబుళ్లకు స్కిల్స్ డెవలప్‌మెంట్‌పై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. మహిళల నిరసన కార్యక్రమాల సందర్భాల్లో మహిళాపోలీసు సిబ్బంది వ్యవహరించాల్సిన తీరు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. వారం రోజులపాటు శిక్షణ కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో పీఈటీలు, పీడీలుగా పనిచేస్తూ రెజ్లింగ్, జూడోలో జాతీయ పతకాలు అందుకున్న టీచర్లు ఆయా అంశాల్లో శిక్షణ ఇస్తారన్నారు.

మహిళా సిబ్బంది ప్రతి ఒక్కరూ డ్రైవింగ్, స్విమ్మింగ్‌తోపాటు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా అన్ని రకాల మెలకువలను నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిజామాబాద్ అదనపు డీసీపీ (ఏఆర్) రామచంద్రారావు, ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, రిజర్వ్ సీఐలు సతీశ్, శేఖర్ బాబు, ప్రభుత్వ స్కూళ్ల సిబ్బంది సంతోషి, అనిత, రజినీ తదితరులు పాల్గొన్నారు.

వరదొస్తోంది..

- క్రమంగా పెరుగుతున్న ఎస్సారెస్పీ నీటిమట్టం
- 19 టీఎంసీలు దాటిన నీటి నిల్వ
- రైతుల్లో చిగురించిన ఆశలు



శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో ప్రస్తుత నీటి నిల్వ

బాల్కొండ : ఆయకట్టు రైతుల ఆశలు చిగురించేలా శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద వస్తోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి నిల్వ 19 టీఎంసీలు దాటింది. సకాలంలో కాలువల ద్వారా నీటి విడుదల చేపట్టే అవకాశం ఉంటుందని రైతులు ఆశిస్తున్నారు. గతంలో కొన్నేళ్లపాటు సెప్టెంబర్ వరకు ఇన్‌ఫ్లో రాలేదు. అయితే 2018 నుంచి పరిస్థితి మారి సెప్టెంబర్ సెంటిమెంట్‌కు బ్రేక్‌పడింది. జూలై చివరి నాటికి ప్రాజెక్ట్ నిండుకుండలా మారుతోంది. గతేడాది కూడా జూలై చివరి నాటికి ప్రాజెక్టు నిండగా, ఈ ఏడాది కూడా అదే పరిస్థితి ఉంటుందని ఆయకట్టు రైతులు ఆశిస్తున్నారు. ప్రాజెక్టు నిండితే 9 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందుతుంది.

'మహా' వరదలు..

మహారాష్ట్ర ప్రాంతంలో గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో ఎస్సారెస్పీలోకి భారీగా వరదలు వచ్చే అవకాశం ఉందని ప్రాజెక్టు అధికారులు అంటున్నారు. ఈనెల 1న మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తగా, బాలేగావ్, అముదారా బ్యారేజీలు నిండుకుండల్లా మారినట్లు సమాచారం. రెండు బ్యారేజీల నుంచి వరద ఎస్సారెస్పీకి వస్తుంది.

గతేడాది కంటే 7 టీఎంసీలు ఎక్కువ..

ప్రస్తుత సంవత్సరం ప్రాజెక్ట్‌లో గతేడాది కంటే 7 టీఎంసీల నీరు ఎక్కువగా ఉంది. ప్రాజెక్ట్‌లో గతేడాది ఇదే రోజున 12.03 టీఎంసీలు నీరు నిల్వ ఉంటే ప్రస్తుత సంవత్సరం 19.3 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది కంటే నీరు ఎక్కువ నిల్వ ఉండటం మంచి పరిణామని ప్రాజెక్ట్ అధికారులు సైతం అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురువడం వలన నిత్యం ఎగువ ప్రాంతా లనుంచి వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో ప్రాజెక్ట్ నీటి మట్టం క్రమంగా పెరుగుతుంది.

కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

ఎగువ నుంచి ప్రాజెక్టులోకి ప్రస్తుతం 5,178 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. కాకతీయ కాలువ ద్వారా 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 341 క్యూసెక్కుల నీరు పోతోంది. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి 1067.30(19.3 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

మంజూరు చేస్తే చాలు..

- ఇంజినీరింగ్ కళాశాల కోసం తెయూ వీసీ, రిజిస్ట్రార్ ప్రయత్నాలు
- పోస్టులు ఇవ్వకున్నా.. తరగతులు ప్రారంభిస్తామని విన్నపాలు
- ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల విద్యార్థుల ఆశలు నెరవేరేనా..?



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ కళాశాల నిర్వహణ కోసం భవనం, విశాలమైన క్యాంపస్, మౌలిక వసతులు, అధ్యాపకులు ఉన్నారని.. ప్రభుత్వం కళాశాల మంజూరు చేస్తే చాలు తాము కోర్సులు నడుపుతామని వీసీ టి.యాదగిరిరావు, రిజిస్ట్రార్ ఎం.యాదగిరి కోరుతున్నారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి గత నెల 24వ తేదీన తెయూకు రాగా ఈ మేరకు విన్నవించారు. స్వయంగా తానే చొరవ తీసుకుని సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తెయూలో ఇంజినీరింగ్ కళాశాల మంజూరుకు కృషి చేస్తానని చైర్మన్ హామీ ఇచ్చారు. వీసీ నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లి రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణాను కలిసి మరోసారి ఫైల్‌ను అందజేశారు. ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. కేవలం కళాశాల మంజూరు అనుమతి ఇస్తే చాలని, పోస్టులు ఇవ్వాల్సిన అవసరం లేదని.. ఇదే విద్యాసంవత్సరంలో తరగతులు ప్రారంభిస్తామన్నారు. అనంతరం ఉన్నత విద్యామండలి చైర్మన్‌ను కలిసి మరోసారి కళాశాల అంశాన్ని గుర్తు చేశారు.


సీఎం హామీ ఇచ్చినా..

సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలోని కోస్గి పాలిటెక్నిక్ కళాశాలలో ఇంజినీరింగ్ కోర్సుల ఏర్పాటుకు అనుమతి లభించింది. మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్‌కు ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేయించుకున్నారు. ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోనూ కళాశాలల ఏర్పాటుకు ఆయా జిల్లాల ఎమ్మెల్యేలు చొరవ తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఇంజినీరింగ్ కళాశాల సాధించడంపై ఎందుకు శ్రద్ధ చూపడం లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. కళాశాల ఏర్పాటుకు ఎమ్మెల్యేల చొరవ కీలకమని, గతంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో, సీఎం అయిన తర్వాత రేవంత్‌రెడ్డి నిజామాబాద్ జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని గురు చేసి కళాశాల మంజూరు చేయించాల్సిన బాధ్యతల ఎమ్మెల్యేపై ఉందంటున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి మంత్రివర్గంలో చోటు లేకపోవడమూ కళాశాల మంజూరు అంశంపై ప్రభావం చూపుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రెండో విడత కౌన్సెలింగ్ లోపు వస్తుందా?

రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల కోసం తొలి విడత కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయ్యింది. కనీసం రెండో విడత కౌన్సెలింగ్ లోపైనా తెలంగాణ యూనివర్సిటీకి ఇంజినీరింగ్ కళాశాల మంజూరవుతుందా? లేదా? అని విద్యార్థులు, అధ్యాపకులు ఆశగా ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో ఇంజినీరింగ్ కళాశాలలు ఉండగా, కొన్ని ఉమ్మడి జిల్లాల్లో రెండు, మూడు కళాశాలలు ఏర్పాటయ్యాయి. అయితే రాష్ట్రంలో మూడో అతి పెద్ద వర్సిటీగా పేరొందిన తెలంగాణ యూనివర్సిటీలో, ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల లేకపోవడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు ఉమ్మడి జిల్లాల విద్యార్థులు ఇంజినీరింగ్ కోర్సులు చదవాలంటే హైదరాబాద్ లేదా ఇతర దూరప్రాంతాలకు వెళ్లాల్సి రావడంతో వారిపై అదనపు భారం పడుతోంది.

అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం..



తెయూలో ఇంజినీరింగ్ కళాశాల మంజూరు కోసం అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం. ఇటీవల విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణాను కలిసి ఫైల్‌ను అందజేశా. కళాశాల మంజూరు చేస్తే చాలని, వెంటనే తరగతులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపాం. రెండో విడత కౌన్సెలింగ్ ప్రారంభమయ్యేలోగా కళాశాల మంజూరు చేస్తే ప్రవేశాలు చేపట్టే అవకాశం ఉంటుంది.

– టి.యాదగిరిరావు, వీసీ

క్లుప్తంగా

ఫర్టిలైజర్ దుకాణం తనిఖీ



కమ్మర్‌పల్లి: కలుపు మందు పిచికారితో సోయాబీన్ పంట ఎండిపోవడంతో మందు విక్రయించిన ఫర్టిలైజర్ దుకాణాన్ని డీఏవో వీరస్వామి సోమవారం తనిఖీ చేశారు. గడ్డి మందు కొట్టడంతో సోయాబీన్ పంటలు ఎండిపోయాయని రైతులు వ్యవసాయాధికారులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో మండలంలోని ఉప్లూర్, కమ్మర్‌పల్లి, చౌట్‌పల్లి గ్రామల్లో కలుపు మందు పిచికారి చేయడంతో ఎండిపోయిన పంటలను వారు పరిశీలించారు. అనంతరం రైతులు కొనుగోలు చేసిన ఫెర్టిలైజర్ షాపును తనిఖీ చేశారు. పంటకు నష్టం చేకూర్చిన కలుపు మందు(హెర్బిసైడ్స్)ను ఎవరికి విక్రయించుకుండా సీజ్ చేశారు. శాంపిల్ సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. రిపోర్టు రాగానే చట్టపరమైన ఆదేశాలు తీసుకుంటామని డీఏవో తెలిపారు. ఏవో రమ్యశ్రీ, ఏఈవోలు తదితరులు ఉన్నారు.

'అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి'



సదాశివనగర్: అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ విజయ రామారావు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్యవైశ్య ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ధూపదీప నైవేద్య అర్చక సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని అర్చకులు కమిషనర్‌తో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల అర్చక సంఘ అధ్యక్షులు అంజనప్ప, రాచప్ప, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు గోపి కృష్ణమాచార్యులు, ఆయా ఆలయాల కమిటీల చైర్మన్‌లు బీరయ్య, రవి, రాజయ్య, స్థానిక అర్చకులు సంతోష్‌కుమార్ శర్మ, జంగం గంగాధర్, ప్రసాద్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు తిరిగి ఫోన్లను అందించినట్లు ఎస్సై సాయిరెడ్డి సోమవారం తెలిపారు. 11 మందికి సెల్‌ఫోన్‌లు అందించామని, సెల్‌ఫోన్ పోతే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు. ఈసందర్భంగా ఫోన్లను రికవరీ చేసిన కానిస్టేబుళ్లు సుప్రియ, సలావుద్దీన్‌లను ఎస్సై అభినందించారు.

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలి

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి
- ప్రజావాణికి 126 ఫిర్యాదులు

నిజామాబాద్‌అర్బన్: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. నగరంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డీఆర్డీవో సాయాగౌడ్, నగర మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్, మెప్మా పీడీ రాజేందర్, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. మొత్తం 126 ఫిర్యాదులు అందాయి. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ అర్జీదారులకు సమాచారం తెలియజేయాలన్నారు.

వేతనాలు మంజూరు చేయండి..

కేజీబీవీలలో నూతనంగా నియమించబడ్డ నాన్ టీచింగ్ సిబ్బందికి వేతనాలు ఇప్పించాలని ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గత ఐదు నెలల నుంచి వేతనాలు రావడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే వేతనాలు మంజూరు చేయించాలని కోరారు.



కలెక్టరేట్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ తదితరులు

ఆన్‌లైన్‌లో భూవివరాలు నమోదు చేయాలి

ఆర్మూర్‌లోని వడ్డెర కాలానికి చెందిన పలువురు రైతులు తమ భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. ఈమేరకు వారు కలెక్టర్‌ను కలిసి సమస్యను విన్నవించారు. సర్వే నంబర్ 189/20కి సంబంధించిన భూములు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని, సమస్యను అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే తమ భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు.

ప్రవేశ మార్గాలను మూయొద్దు

నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఇరువైపులా ఉన్న ప్రవేశ మార్గాలను రాత్రివేళ మూసివేయవద్దని వ్యాపారులు కోరారు. వారు ప్రజావాణిలో సమస్యను కలెక్టర్‌కు విన్నవించారు. రాత్రివేళ మార్కెట్ కమిటీకి ఇరువైపులా ఉన్న ప్రవేశం మార్గాలు మూసివేయడం వల్ల ఆ తర్వాత బయటకు వెళ్లేందుకు వీలుపడడం లేదన్నారు. అకస్మాత్తుగా ఏవైన ఘటన జరిగినా ఇబ్బందిగా ఉంటుందన్నారు.

రీయింబర్స్‌మెంట్ అందించాలి..

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ, టీజీవీపీ నాయకులు వేర్వేరుగా డిమాండ్ చేశారు. ఈమేరకు వారు సమస్యను ప్రజావాణిలో కలెక్టర్‌కు విన్నవించారు. టీజీవీపీ నగర అధ్యక్షుడు అఖిల్ మాట్లాడుతూ.. రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కళాశాలలో యాజమాన్యాలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. అలాగే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. బెస్ట్ అవైలబుల్ స్కీంకు సంబంధించిన బకాయిలను విడుదల చేయాలన్నారు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు విగ్నేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మూడు నెలలుగా వేతనాలు లేవు..



నిరసన తెలుపుతున్న కార్మికులు

జిల్లాలోని గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న తమకు మూడు నెలలుగా జీతాలు రావడం లేదని జీపీ కార్మికులు, కారోబార్లు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వేతనాలు ఇప్పించాలని కోరుతూ వారు యూనియన్ నాయకులతో కలిసి ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే ఎంపీడబ్ల్యూ విధానం తీసివేయాలన్నారు. ఈ విధానం వల్ల అనేక ఇబ్బందులు కలుగుతున్నాయని కార్మికులు పేర్కొన్నారు. అంతకుముందు కలెక్టరేట్ ప్రవేశం మార్గం వద్ద కార్మికులు నిరసన చేశారు.

పోలీస్ ప్రజావాణికి 27 ఫిర్యాదులు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ సీపీ కార్యాలయంలో సోమవారం సీపీ పోతరాజు సాయిచైతన్య పోలీస్ ప్రజావాణి నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఫిర్యాదిదారులు రాగా, 27 అర్జీలను స్వీకరించారు. అనంతరం సీపీ ఫిర్యాదులను పరిశీలించి, పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ ఎస్సైలు, సీఐలకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేశారు. ప్రజలు పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి సమస్యలను పరిష్కరించుకొనేందుకు ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు సీపీ తెలిపారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీపీ పోతరాజు సాయిచైతన్య

హై-వోల్టేజీతో విద్యుత్ సామగ్రి దగ్ధం

మోపాల్: మండలంలోని తాడెం గ్రామంలో సోమవారం హై ఓల్టేజీ కారణంగా సుమారు 20 ఇళ్లల్లో రిఫ్రిజిరేటర్లు, టీవీలు కాలిపోయాయని బాధితులు వాపోయారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా తాము తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. ఇదే విషయమై విద్యుత్‌శాఖ అధికారులను సంప్రదించగా, హై వోల్టేజీ కారణంగా జరుగుతుంటాయన్నారు.

సైబర్ నేరాలతో జాగ్రత్త!

భిక్కనూరు: సైబర్ నేరాలపై జాగ్రత్త వహించాలని భిక్కనూరు ఎస్సై అంజనేయులు సూచించారు. సోమవారం భిక్కనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ప్రజా కళాజాత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సైబర్ నేరాల బారిన పడితే 1930కు.. అత్యవసర సమయంలో 100 నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు.

రుద్రూర్‌కు ఆ పేరు ఎలా వచ్చిందంటే..



రుద్రూర్ గ్రామ ప్రధాన ద్వారం



గ్రామంలోని బురుజు

మీకు తెలుసా?

రుద్రూర్: కాకతీయుల కాలంలో రాణీ రుద్రమదేవి వంశీయులు ఈ ప్రాంతాన్ని పరిపాలించినందున గ్రామానికి రుద్రూర్‌గా పేరు వచ్చింది.

- రాణీ రుద్రమదేవికి సంబంధించిన సైనిక స్థావరం రుద్రూర్‌లో ఉండేదని గ్రామపెద్దలు చెబుతున్నారు.
- గ్రామానికి మూడు వైపుల బురుజులు (గడి)లు, ఒక వైపు చెరువు ఉంది. కాలక్రమేణ రెండు అంతరించిపోగా రాతితో నిర్మించిన ప్రధాన ద్వారం చెక్కు చెదరకుండా ఉంది.
- గ్రామం మధ్యలో రాతితో కట్టిన పెద్ద పురాతన కోట (బురుజు) ఉంది. ఇందులో కాకతీయుల సైనిక స్థావరం ఉండేది. ఇక్కడి నుంచి సొరంగ మార్గం (బావి) రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం వరకు ఉన్నట్టు గ్రామ పెద్దలు పేర్కొన్నారు.
- కాకతీయుల కాలంలో రాతితో నిర్మించిన రాజరాజేశ్వర ఆలయం ఎంతో ప్రత్యేకతను కలిగి ఉంది.

కేటీఆర్ వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి

వేల్పూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 18 నెలలుగా ఏమి చేసిందో కేటీఆర్ గ్రామాలు తిరిగి వాస్తవాలు తెలుసుకొని, మాట్లాడాలని రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. వేల్పూర్ మండల కేంద్రంలో సోమవారం ఆయన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పరిపాలనలో రాష్ట్రంలో ఎక్కడా కూడా ఇల్లులేని పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధిని చూడకుండా సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ అవాకులు, చెవాకులు చేస్తే సహించేది లేదన్నారు. మండలాలు, గ్రామాలలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి సహకరించాలని సూచించారు. గోదావరి అనే లబ్ధిదారురాలు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని చూసి సంతోషం వ్యక్తం చేశారు.వేల్పూర్ ఏఎంసీ వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, డైరెక్టర్ గౌరాయి నరేందర్, నాయకులు దామోదర్‌గౌడ్, మల్లేష్, రమణ, రాజేందర్, రాజేశ్వర్, లావణ్య, లహరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

మహిళా ప్రాంగణాలకు పూర్వ వైభవం

పెర్కిట్(ఆర్మూర్): బీఆర్ఎస్ పాలనలో మరుగున పడిన మహిళా ప్రాంగణాలకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మళ్లీ పూర్వ వైభవం సంతరించుకుంటున్నాయని తెలంగాణ మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లోగల దుర్గాబాయి మహిళ శిశు వికాస కేంద్రంలో సోమవారం ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు పూర్తి చేసుకున్న వారికి క్యాపింగ్ సెర్మనీ నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు పూర్తి చేసుకున్న వారు నిస్వార్థంగా సేవలందించాలన్నారు. అనంతరం కోర్సు పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్లు అందజేసి క్యాపింగ్ చేశారు. డబ్ల్యూసీడీసీ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రకాంత్‌రెడ్డి, అదనపు కలెక్టర్ అంకిత్, ఐసీడీఎస్ సీడీపీవో జ్యోతి, ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, మున్సిపల్ కమీషనర్ రాజు, శిక్షణ తీసుకున్న అభ్యర్థినులు పాల్గొన్నారు.



శిక్షణార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న శోభారాణి

ముగ్గురు ఏఎస్సైలకు పదోన్నతి

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ముగ్గురు ఏఎస్సైలకు పదోన్నతులు వచ్చాయి. ఈ మేరకు సీపీ సాయిచైతన్య ఉత్తర్వులు జారీ చేశారు. బోధన్ రూరల్ పీఎస్‌లో పని చేస్తున్న ఏఎస్సై నాగభూషణంకు ఎస్సైగా ప్రమోషన్ కల్పించి, నిర్మల్ జిల్లాకు పంపించారు. మాక్లూర్ ఠాణాలో పని చేస్తున్న నర్సయ్యను నిర్మల్ జిల్లాకు పదోన్నతిపై పంపించారు. నిజామాబాద్ త్రీ టౌన్ ఏఎస్సై లీలాకృష్ణకు ఎస్సైగా ప్రమోషన్ ఇచ్చి ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ చేశారు.



క్రైం కార్నర్

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

- భర్త మృతి, భార్యకు గాయాలు



మృతి చెందిన రాములు

బోధన్‌టౌన్(బోధన్): ఎడపల్లి మండలం దూపల్లి గేట్ సమీపంలోని బోధన్-నిజామాబాద్ ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై ముత్యాల రమ తెలిపిన వివరాలు ఇలా.. రెంజల్ మండలం బాగేపల్లి గ్రామానికి చెందిన దంపతులు వాద్యాల రాములు(54), ఇంద్ర కలిసి సోమవారం ద్విచక్ర వాహనం (టీవీఎస్ చాంప్)పై నిజామాబాద్ నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. దూపల్లి గేట్ వద్ద వారు రోడ్డు దాటుతుండగా బోధన్ నుంచి నిజామాబాద్‌కు వెళ్తున్న కారు వారిని వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో భర్త వాద్యాల రాములు అక్కడికక్కడే మృతి చెందగా భార్య ఇంద్రకు గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి ఇంద్రను నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దుబాయ్‌లో పెద్దవాల్గోట్ వాసి ..

సిరికొండ: మండలంలోని వాల్గోట్ గ్రామానికి చెందిన వడియాల రవీందర్ (38) ఈ నెల 4న గల్ఫ్ దేశమైన దుబాయిలో గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య లావణ్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. బతుకు దెరువు కోసం కొద్ది సంవత్సరాలుగా రవీందర్ దుబాయ్‌కి వెళ్తున్నాడు. సెలవుపై ఏడాది క్రితం ఇంటికి వచ్చి, వెళ్లాడు. రోజూలాగే డ్యూటీకి వెళ్లివచ్చి రూమ్‌కు విశ్రాంతి తీసుకుంటున్న రవీందర్ ఒక్కసారిగా గుండెపోటుకు గురయ్యాడు. వెంటనే తోటి స్నేహితులు హాస్పిటల్‌కు తరలించే లోపే మృతి చెందాడు. ప్రభుత్వం స్పందించి మృతదేహాన్ని త్వరగా స్వదేశానికి రప్పించాలని కుటుంబీకులు, గ్రామస్తులు కోరుతున్నారు.



రవీందర్ (ఫైల్)

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

వేల్పూర్: మండలంలోని లక్కోర గ్రామ శివారులో సోమవారం ఉదయం గూడ్స్ రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు నిజామాబాద్ రైల్వే పోలీస్ ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. నిజామాబాద్ స్టేషన్ మేనేజరు హరికృష్ణ తెలిపిన సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి పోలీసులు వివరాలు సేకరించారు. మృతుడు ఆత్మహత్య చేసుకోవాలన్న ఉద్దేశంతోనే గూడ్స్ రైలు రాకను గమనించి పట్టాలపై పడుకోగా, అతడిపై నుంచి రైలు వెళ్లిందన్నారు. దీంతో అతడు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. మృతుడిని గుర్తించుటకు ఎటువంటి ఆధారాలు లభించలేవన్నారు. మృతుడి వయస్సు సుమారు 35ఏళ్లు ఉండవచ్చని భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.

అందరు ఉన్నా.. అనాథలా మృతి

- గతనెల 28న రోడ్డు ప్రమాదంలో గాయపడిన అశోక్
- ఆస్పత్రిలో చేర్పించి పోలీసులకు సమాచారమిచ్చిన అంబులెన్స్ సిబ్బంది
- తమ కుమారుడు కనిపించడం లేదని ఫిర్యాదు చేసిన తండ్రి
- దర్యాప్తు చేయడంలో పోలీసుల నిర్లక్ష్యం
- చికిత్స పొందుతూ మృతి



కొరబోయిన అశోక్ (ఫైల్)

జక్రాన్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఓ యువకుడు వారం రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నా కుటుంబసభ్యులకు సమాచారం లేకపోవడంతో అనాథలా మృతిచెందాడు. మృతుడి కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని అర్గుల్ గ్రామానికి చెందిన కొరబోయిన అశోక్(32) మేస్త్రీ పని చేస్తుండేవాడు. అతడు కొన్నేళ్ల క్రితమే లింగంపేట్ మండలం నుంచి అర్గుల్ గ్రామానికి కుటుంబంతో వలస వచ్చి, జీవనం కొనసాగిస్తున్నాడు. గత నెల 28న రాత్రి అతడు జక్రాన్‌పల్లిలో స్నేహితుడిని కలిసి వస్తానని బైక్‌పై ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఎంతకీ తిరిగిరాకపోవడంతో మరుసటి రోజు తండ్రి ప్రభురాజ్యం జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ అయినట్లు ఫిర్యాదు చేశాడు. జిల్లాకేంద్ర ఆస్పత్రిలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందగా ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతుడు అశోక్‌గా గుర్తించి, ప్రభురాజ్యంకు సమాచారం ఇచ్చారు. వెంటనే అతడు ఆస్పత్రికి చేరుకొని మృతిచెందినది తన కుమారుడే అని బోరున విలపించారు.

బైక్‌ను ఠాణాకు తరలించారు.. విచారణ మరిచారు..

ఆస్పత్రిలో వారం రోజులుగా ఎవరూ లేని అనాథలా చికిత్స పొందుతున్న అశోక్ మృతి చెందడం పలు అనుమానాలకు తావిస్తోంది. 28న రాత్రి జక్రాన్‌పల్లి సర్వీసు రోడ్డులో ఒక యువకుడు బైక్ అదుపుతప్పి కిందపడిపోగా చికిత్స నిమిత్తం జిల్లాకేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు అంబులెన్స్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. మరుసటి రోజు పోలీసులు బైక్‌ను ఠాణాకు తరలించారు. అయితే ఆ ఘటనలో గాయపడ్డవారు ఎవరు? అని పోలీసులు వివరాలు సేకరించడంలో నిర్లక్ష్యం వహించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టినట్లయితే అతడు ప్రాణాలతో ఉండేవాడని అర్గుల్‌కు చెందిన ఓ మాజీ ప్రతినిధి పేర్కొన్నారు. అశోక్‌ను ఆస్పత్రిలో చేర్పినప్పటికీ అతనికి సంబంధించిన వ్యక్తులు లేకపోవడం వల్ల వైద్యులు సైతం వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహించినట్లు అనుమానం వ్యక్తం చేశారు. స్వల్ప గాయాలైన వ్యక్తి మరణించడంపై అనుమానంగా ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ విషయమై 'సాక్షి' జక్రాన్‌పల్లి ఎస్సైను వివరణ కోరేందుకు యత్నించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

60 గ్రాముల గంజాయి పట్టివేత!

ఖలీల్‌వాడి: నగరంలోని ఎల్లమ్మగుట్ట బ్రిడ్జి వద్ద గంజాయి అమ్ముతున్న బాలుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వీరి నుంచి ఎండు గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. చిన్న, చిన్న ప్యాకెట్లలో సుమారు 60 గ్రాముల వరకు గంజాయి ఉంటుందని సమాచారం. ఈ విషయమై నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్‌ను వివరణ కోరగా గంజాయి పట్టుకున్నామని, బాలుడు మైనరా? మేజరా? అనేది నిర్ధారించాల్సి ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే నగరంలోని ఓ ప్రయివేట్ కాలేజీకి చెందిన విద్యార్థులు గంజాయి పడుతుండగా పోలీసులు పట్టుకున్నారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చిన తర్వాత కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఏడు ఇసుక ట్రాక్టర్లు..

రుద్రూర్: పోతంగల్ మండలం కొడిచర్ల శివారులోని మంజీరా నది నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను, ఒక ట్రాలీని సోమవారం తెల్లవారుజామున పట్టుకున్నట్టు ఎస్సై సునీల్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి ట్రాక్టర్లను పట్టుకుని కోటగిరి పోలీస్‌స్టేషన్ తరలించామని ఆయన పేర్కొన్నారు. ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.



డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలో పోలీసులు ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో కొటగిరి మండలం ఎత్తోండ గ్రామానికి చెందిన లక్ష్మయ్య, పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీకి చెందిన భరత్ మద్యం తాగి బైక్‌లు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వారిపై కేసు నమోదు చేసి సోమవారం బోధన్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేషతల్పసాయి ఎదుట హాజరుపర్చారు. జడ్జి ఇద్దరికి రెండు రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు సీఐ వెంకట నారాయణ తెలిపారు.

నిందితుడి రిమాండ్

మోపాల్: మండలంలోని ముదక్‌పల్లిలో పెళ్లి పేరుతో ఓ యువతిని మోసం చేసిన కేసులో అస్మత్ ఖాన్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై జడ్ సుస్మిత సోమవారం తెలిపారు. పెళ్లి చేసుకుంటానని చెప్పి గర్భం దాల్చిన తర్వాత మొహం చాటేస్తున్నాడని బాధిత మహిళ రెండ్రోజుల క్రితం అస్మత్ ఖాన్‌పై ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరిపిన పోలీసులు అస్మత్ ఖాన్‌ను రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి



నవీపేటలోని కందకుర్తి క్రాసింగ్ రోడ్డు వద్ద హద్దులను కొలుస్తున్న పోలీసులు

నవీపేట: రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టిసారించినట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు సోమవారం వారు మండలంలోని ధర్మారం(ఏ), శివాజీ చౌక్ ప్రాంతాలలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను పరిశీలించారు. 2022 నుంచి 2024 వరకు ఈ రెండు ప్రాంతాలలో పలు ప్రమాదాలు జరుగగా, పదుల సంఖ్యలో గాయపడ్డారు. దీంతో నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఆర్అండ్‌బీ ఈఈ రామ్మోహన్, ఆడార్ మేనేజర్ వర్షనిహంత్, ఇరిగేషన్ ఏఈ శ్రీధర్‌లు రోడ్డుకు ఇరువైపుల ఖాళీ ప్రదేశాలను కొలిచారు. రోడ్డు విస్తీర్ణంపై స్థానిక వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలో నిబంధనలు అతిక్రమించి ముందుకు వచ్చిన వ్యాపారులు స్వచ్ఛందంగా హద్దులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగనాత్, నవీపేట జీపీ కార్యదర్శి రవీందర్ నాయక్, స్థానిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.